ట్రంప్ విధానాలకు తలొగ్గిన మోదీ
- సుంకం రద్దుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం
- బలమైన రైతాంగ ఉద్యమాలే వ్యవసాయానికి రక్ష 6
- వామపక్ష సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల పిలుపు
- ఖమ్మంలో సదస్సు.. హాజరైన పోతినేని, బాగం, పద్మ

'పీఎం కుసుమ్'కు ప్రోత్సాహం కరువు

- లక్ష్యానికి అడ్డంకిగా బ్యాంకుల నిబంధనలు
- రుణాలు మంజూరు చేస్తేనే యూనిట్లకు అవకాశం
- ఎన్పీడీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నా దక్కని ఫలితం



ఖమ్మం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నో పథకాలను రూపొందించి లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలోని పరిస్థితులు ఆ లక్ష్యాలకు అడ్డంకులుగా మారుతున్నాయి. బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు సరైన ప్రోత్సాహం అందకపోవడం సమస్యగా మారుతోంది. రుణాలిచ్చేందుకు బ్యాంకులు సవాలక్ష నిబంధనలు పెడుతుండటంతో ఆసక్తి ఉన్న వారు సైతం వెనకడుగేసే పరిస్థితి కనిపిస్తోంది. రైతులతో విద్యుత్ ఉత్పత్తి చేయించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవమ్ ఉత్పాదన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. 500కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి చేయించేందుకు తెరపైకి తెచ్చిన ఈ ప్రత్యేక పథకంలో రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి తద్వారా వారికి లాభాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సబ్‌స్టేషన్‌కు 5కి.మీ.లోపు ఉన్న భూములకు మాత్రమే ఈ సోలార్ పవర్ ప్లాంట్ పెట్టే అవకాశం ఉంది. అయితే ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు 4ఎకరాల భూమి అవసరం కాగా.. ఈ యూనిట్‌కు సుమారు రూ.2కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇందులో 20శాతం రైతులు భరించగలిగితే 80శాతం బ్యాంకు రుణం వస్తుంది. ఈ క్రమంలో ఆ భూమిని బ్యాంకుకు మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. అయితే 25 ఏళ్ల పాటు యూనిట్ కాలపరిమితిని నిర్ణయించారు. అప్పటివరకు రైతులు ఉత్పత్తి చేసే పవర్ యూనిట్‌కు రూ.3.13 పైసల వంతున చెల్లించేలా ఎన్పీడీసీఎల్‌తో జిల్లాకు చెందిన కొందరు రైతులు ఒప్పందం చేసుకున్నారు.

మధ్యవర్తిగా రెడ్కో..

తెలంగాణ రెడ్కో మధ్యవర్తిగా ఉండి ఖమ్మం జిల్లాలో 35 మంది రైతులకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 13 మందితో ఒప్పందం చేశారు. ఇంకా కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఒప్పందం చేసుకున్న రైతులకు బ్యాంకుల నుంచి ఒక్క యూనిట్‌కు కూడా రుణం రాలేదు. దీంతో పీఎం కుసుమ్ కింద సౌరవిద్యుత్ యూనిట్లు ఉమ్మడిజిల్లాలో ఏర్పాటుచేయలేని పరిస్థితి నెలకొంది. వ్యక్తిగతంగా రైతులతో పాటు రైతుగ్రూపులు, సహకారసంఘాలు, రైతు ఉత్పత్తి దారుల సంస్థలు, నీటి వినియోగదారుల సంఘాలు, వ్యక్తిగతంగా, సమష్టిగా ఈ సోలార్ ఉత్పత్తి యూనిట్లు పెట్టుకునే అవకాశం ఉంది. రైతులు తమ విద్యుత్ అవసరాలను డీజిల్, ఇతర ఇంధనాలపై ఆధారపడకుండా తీర్చుకోవడంతో పాటు ప్రభుత్వ గ్రిడ్‌కు విద్యుత్‌ను అందించి వ్యాపారం చేసే సౌలభ్యం కలుగుతుంది. తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జి డెవలప్‌మెట్ కార్పొరేషన్ (టీఎస్‌రెడ్కో) మధ్యవర్తిగా ఉండి రైతులకు తగిన సూచనలు అందిస్తుంది.

కొరవడుతున్న సహకారం..

అయితే రైతులు తమ కున్న ఖాళీ భూముల్లో సోలార్ యూనిట్లు పెట్టేందుకు ముందుకు వస్తున్నా బ్యాంకుల నుంచి ఆర్థిక సహకారం ఉండకపోవడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సబ్సిడీలు లేకపోవడం ఈ పథకం లక్ష్యానికి ఇబ్బందులు (మిగతా 6వ పేజీలో)

ఇందులో మర్మమేంటి?

- భద్రాద్రి దేవస్థానంలో మళ్లీ ఆ వ్యక్తి హల్‌చల్
- పక్షం రోజులు గడవక ముందే ప్రసాదాల విభాగం బాధ్యుడి మార్పు
- ఆ వ్యక్తికి మార్గం సుగమం చేసేందుకేనా ఇది? అని చర్చ



భద్రాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నూతన ఈవో బాధ్యతలు చేపట్టిన అనంతరం పలు కీలక విభాగాల్లో అంతర్గతంగా మార్పులు చేర్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ కోవలోనే అంతర్గత బదిలీలు జరిగాయనే ప్రచారం లేకపోలేదు. ఇటీవల గణేష్ నిమజ్జన సమయంలో అంతా సవ్యంగా సాగుతున్నా.. ప్రసాదాల తయారీ విభాగం బాధ్యున్ని ఉద్దేశపూర్వకంగా మార్చారనే విమర్శలు దేవస్థానం వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ఇదే విభాగంలో పలు ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొన్న ఉద్యోగికి మళ్లీ అదే విభాగపు బాధ్యతలు అప్పగించడంలో మర్మమేంటనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కీలక సమయంలో మళ్లీ గతంలో బాధ్యతలు నిర్వహించిన వారినే ప్రసాద తయారీ పర్యవేక్షణ చేయాలని మౌఖికంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా దేవస్థానం ఆధ్వర్యంలోనే స్వామి వారి లడ్డూ ప్రసాదాల తయారీ నిర్వహిస్తుండగా గతానికి భిన్నంగా అంతా సజావుగా సాగుతోందని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా అంతకు ముందు దేవస్థానంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి మళ్లీ సుదీర్ఘ విరామం తరువాత దేవస్థానంలో హల్‌చల్ చేస్తుండటం పట్ల దేవస్థానం వర్గాల్లోనే అంతర్గత చర్చ సాగుతున్నట్టు ప్రచారం ఉంది. ఈ క్రమంలో నూతనంగా కీలక అధికారి రావటంతో ఇటీవల కాలంలో సదరు వ్యక్తి చురుగ్గా వ్యవహరిస్తుండటం కొన్ని సమయాల్లో దేవస్థానం సిబ్బందిపై అతిగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. ఇటీవల కీలక విభాగాలలో చోటుచేసుకున్న మార్పులు ఓ కీలక విభాగంలో ఆ వ్యక్తికి మార్గం సుగమం చేసేందుకేనా? ఈ మార్పు అంటూ చర్చ తెరపైకి వస్తోంది. ఈ సందర్భంగా గతంలో ఆ విభాగంలో పని చేసి చర్యలకు గురైన వారికే బాధ్యతలు అప్పజెప్పడాన్ని వారు ఉదహరిస్తున్నారు. ఈ ప్రయత్నం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నా ఆచరణరూపం దాల్చే అవకాశాలు లేకపోలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆ కథలన్నీ కంచికేనా?

భద్రాద్రి దేవస్థానంలో గతంలో ఉద్యోగుల చేతివాటం, అవినీతి, అవకతవకలు లాంటి ఘటనల్లో బాధ్యులైన వారిపై చర్యలు ఇప్పటివరకు నామామాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానంలో చోటుచేసుకున్న ఆ కథలన్నీ ఇక కంచికేనా అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయంటే పరిస్థితి ఏ రీతిలో ఉందో అర్థమవుతోంది. దేవస్థానంలో తరచూ విధి నిర్వహణలో ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొన్న వారికే కీలక విభాగాల్లో పీట వేయడం గత కొన్నేళ్లుగా వస్తూనే ఉందని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. దేవస్థానం కీలక అధికారులుగా ఎవరు బాధ్యతలు చేపట్టినా.. సదరు వ్యక్తులే చక్రం తిప్పుతూ ఉంటారన్న ప్రచారమూ ఉంది. గతంలో ఒక సదనం నిర్మాణం (మిగతా 6వ పేజీలో)



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అభివృద్ధి పనులను వేగిరం చేయాలి

- ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను నిర్దేశిత లక్ష్యంతో పూర్తి చేయాలి
- ఆధునిక వసతులతో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం
- పనుల పరిశీలనలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని, అవసరమైన వసతులపై దృష్టి సారించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. కళాశాల భవనం, విద్యార్థులు, ప్రొఫెసర్ల వసతి గృహాల నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్య కళాశాలలో కావాల్సిన వసతుల ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, ప్రహరీ, ప్రధాన రహదారిలో ఆర్చీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన మెడికల్ కళాశాల భవనం, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు ఖమ్మం నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా స్కూల్ ప్రతిపాదిత స్థలాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ మ్యాపులను, నిర్దేశిత స్థలాన్ని పరిశీలించారు. సుమారు 21ఎకరాల్లో 3వేలమంది విద్యార్థులకు అనువైన అధునిక వసతులతో చేపట్టిన నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి పిల్లలకు అందుబాటులో తీసుకురావాలని నిర్మాణ సంస్థను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ పవార్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు

జీపీవోలకు పోస్టింగుల కేటాయింపు

కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా కౌన్సెలింగ్ 6

ఇంకుడుగుంతలో పడి చిన్నారి మృతి

సత్తుపల్లి మండలం సత్యంపేటలో ఘటన 7

76 రోజులు.. రూ.1.52 కోట్లు

- భద్రాద్రి దేవస్థానానికి హుండీల ద్వారా రికార్డు స్థాయి ఆదాయం
- చిత్రకూట మండపంలో లెక్కింపు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి వారికి హుండీల ద్వారా ఈసారి రికార్డుస్థాయి ఆదాయం సమకూరింది. గడిచిన 76 రోజులకు గాను మొత్తం రూ.1,52,59,499 ఆదాయం వచ్చింది. బుధవారం దేవస్థానం ఈవో దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని చిత్రకూట మండపంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు నిర్వహించారు. ఇందులో రూ.1,52,59,499 నగదు, 89 గ్రాముల బంగారం, 1,020 గ్రాముల వెండి వచ్చింది. అలాగే 624 యూఎస్ డాలర్లు, 450 సౌతాఫ్రికా ర్యాండ్స్, 10 ఆస్ట్రేలియా డాలర్స్, 10 యూఏఈ దిరామ్స్, 230కెనడా డాలర్స్, 30 యూరోప్, కిర్గిజ్సాన్ 130 సోమ్స్, 100 ఓమన్ బైజ, థాయ్‌లాండ్ బట్స్ 580, 10 సింగపూర్ డాలర్లు 50, 11 మలేషియా రింగెట్స్, 1 సౌదీ అరేబియా రియల్, 5 నేపాల్ రూపీస్, 1 కువైట్ దినార్ వచ్చాయి. అయితే ఆలయ హుండీలను చివరగా ఈ ఏడాది జూన్ 26న లెక్కించారు.



గడిపూడి వీరభద్రరావు(ఫైల్)



మహేష్ (ఫైల్)



పాయం నర్సయ్య (ఫైల్)

పిడుగుల వాన..

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పిడుగులు
- ముగ్గురి మృతి.. ఇద్దరికి గాయాలు
- 'టేకులపల్లి'కి చెందిన ముగ్గురు కూలీలకు అస్వస్థత

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుచోట్ల పిడుగుల వర్షం పడింది. మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఈ ఘటనల్లో ముగ్గురు మృతిచెందగా.. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు రైతులు ఉండగా.. ఒకరు యువకుడున్నాడు. ఖమ్మం జిల్లా మధిర, సత్తుపల్లి, కామేపల్లి, భద్రాద్రి జిల్లా గుండాల మండలాల్లో పడిన పిడుగులు తీవ్ర విషాదాన్ని నింపాయి. 7

భద్రాద్రి ప్రాంతీయ ఆస్పతిలో వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

● డీసీహెచ్ఎస్ రవిబాబు నాయక్

చుంచుపల్లి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఏడు వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మణుగూరు, ఇల్లెందు - ప్రాంతీయ ఆసుపత్రిలో, పాల్వంచ, చర్ల - సామాజిక ఆరోగ్య కేంద్రాలలో మొత్తం ఏడు వివిధ వైద్య నిపుణుల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ దరఖాస్తు ఫారాలను భద్రాద్రి జిల్లా ఐడీవోసీలోని ఎస్-26లో అందజేయాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి మణుగూరులో ఒక మత్తు, ఒక రేడియాలజీ, ఒక జనరల్ సర్జన్, ప్రాంతీయ ఆసుపత్రి ఇల్లెందు -ఒక జనరల్ సర్జన్, సామాజిక ఆరోగ్య కేంద్రం చర్ల - ఒక మత్తు, ఒక పిల్లల వైద్య నిపుణులు, సామాజిక ఆరోగ్య కేంద్రం పాల్వంచ - ఒక గైనకాలజీ పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు.

17న కొత్తగూడెం జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న కొత్తగూడెం జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో ఈ మేళా జరుగుతుందన్నారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ గ్రూపుల్లో 70శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈమేళాలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యేవారు తమ వెంట పదోతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, ఆధార్, ఒక ఫొటో, మొబైల్ ఫోన్‌తో ఈనెల 17వ తేదీన హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8341405102లో సంప్రదించాలని ఆయన కోరారు.

ట్రంప్ విధానాలకు తలొగ్గిన మోదీ

- సుంకం రద్దుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం
- బలమైన రైతాంగ ఉద్యమాలే వ్యవసాయానికి రక్ష
- ఖమ్మంలో వామపక్ష సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు
- పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు పోతినేని, బాగం హేమంత్‌రావు, పర్స పద్మ



సదస్సులో ఐక్యత చాటుతున్న నేతలు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ తలొగ్గారని వామపక్ష సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు ఆరోపించారు. బుధవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గల చంద్ర కృష్ణమూర్తి సమావేశ మందిరంలో వామపక్ష సంయుక్త కిసాన్ మోర్చా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి దొండపాటి రమేశ్, మాదినేని రమేశ్, మలీదు నాగేశ్వరరావు, బజూరి వెంకట్రామిరెడ్డిలు అధ్యక్షత వహించగా.. తెలంగాణ రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు, పర్ష పద్మ, కెచ్చల రంగయ్య, వీ కోటేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా వామపక్ష కిసాన్ సంయుక్త రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం ద్వారా భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ట్రంప్ నిర్ణయాలకు మోదీ తలొగ్గడమే ఇందుకు కారణమన్నారు. అమెరికాలో వ్యవసాయ రంగానికి 36శాతం సబ్సిడీలు అందిస్తున్నారన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11శాతం పన్ను విధించారని.. ఇప్పుడు మోదీ సర్కార్ ఆ పన్నును ఎత్తివేయడంతో అమెరికా పత్తికి మోదీ సర్కార్ ద్వారాలు తెరిసిందన్నారు. దీనివల్ల దేశంలో పత్తి సాగు చేస్తున్న రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా పత్తి ధరలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి పెట్టుబడి ఆధారంగా క్వింటాకు కనీస మద్దతు ధర రూ.10,076 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో కనీసం రూ.6వేలకు కూడా కొనుగోలు చేయటం లేదని వారు ఆరోపించారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 50లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, ఈ క్రమంలో రాష్ట్రంలోని పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. కార్పొరేట్ శక్తులకు పరోక్షంగా వ్యవసాయ రంగాన్ని అప్పగించే కుట్ర జరుగుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు బకాయిలు మాఫీలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సబ్సిడీలను తొలగిస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని పరిరక్షించేందుకు 586 రైతు సంఘాలు బలమైన కిసాన్ మోర్చాగా ఏర్పడి దేశ వ్యాప్తంగా ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించినట్టు వామపక్ష సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు తెలిపారు. ఈ క్రమంలోనే ఖమ్మంలోనూ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బలమైన రైతాంగ ఉద్యమాలే వ్యవసాయ రంగానికి రక్ష అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, కోలేటి నాగేశ్వరరావు, వై ప్రకాష్ ప్రసంగించారు. అంతకుముందు కిసాన్ మోర్చా నాయకులు నగరంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రశాంతంగా కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

పాల్వంచ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 13 కమిటీ మెంబర్ పోస్టులకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీపడగా.. కేటీపీఎస్‌లో 2106 ఓట్లకు గాను 1728, బీటీపీఎస్‌లో 501 ఓట్లకు గాను 450, వైటీపీఎస్‌లో 396 మంది ఓట్లకు గాను 367 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు.. సివిల్, ఎస్‌పీఎఫ్ పోలీసులను వినియోగించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే అభ్యర్థులు పోలింగ్ స్టేషన్‌కు తమ మద్దతుదారులతో కలిసి వచ్చి క్యాంపెయినింగ్ నిర్వహించారు. క్యాంపెయినింగ్‌కు అభ్యర్థులు ఆర్టిజన్లను, బయట వ్యక్తులను, మైనర్ బాలురను వినియోగించడంపై స్థానిక కార్మికులు, ఇంజనీర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం ఓటింగ్ ప్రారంభించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకుని మూడు స్టేషన్ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఒకే చోట లెక్కించడానికి సమాయత్తమవగా.. అభ్యర్థులు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. స్టేషన్‌ల వారీగా విడివిడిగా ఓట్లను లెక్కించాలని భీష్మించుకు కూర్చోవడంతో ఎన్నికల అధికారులు ఆలోచనలో పడ్డారు.


పోలింగ్ ప్రక్రియ దృశ్యం

జీపీవోలకు పోస్టింగుల కేటాయింపు

కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా కౌన్సెలింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్


హాజరైన జీపీవోలు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పైరవీలకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా మెరిట్ పద్ధతిలో గ్రామ పరిపాలనా అధికారులకు కౌన్సిలింగ్ చేపట్టి, పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పరిపాలనా అధికారులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి ప్రభుత్వం గ్రామాల్లో జీపీవోలను నియమించిందన్నారు. జిల్లాలోని 299 క్లస్టర్లలో గ్రామ పరిపాలనా అధికారుల నియామకానికి కౌన్సిలింగ్ చేపట్టామన్నారు. పరీక్ష ద్వారా 252 మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి సొంత మండలం మినహాయించి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఇతర ప్రదేశాల్లో పోస్టింగులు కల్పిస్తున్నామన్నారు. ప్రజావాణిలో, గ్రామాల సందర్శనలో అధికంగా భూ సమస్యల దరఖాస్తులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించే బాధ్యత మనపై ఉందన్నారు. భూ భారతి చట్టం పటిష్ట అమలుకు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నిజాయితీతో విధులు నిర్వర్తించాలని, అధికారుల సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వం సర్వీస్ రూల్స్ నోటిపై చేస్తుందని, ప్రమోషన్లు, అన్ని ఫలాలు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోస్టింగ్ ఎక్కడ వచ్చినా విధులు సక్రమంగా నిర్వర్తిస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. సమర్థవంతంగా పనిచేసే వారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. రాజేశ్వరి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

- మరింత జఠిలమవుతున్న టిమ్స్ డ్రైవర్ల సమస్య
- 33 సర్వీసులకు నడుస్తున్నవి 20 మాత్రమే..
- ప్రత్యామ్నాయంగా ఇతర డిపోల నుంచి బస్సులు
- అవసరమైతే రవాణా శాఖ మంత్రితో మాట్లాడుతా..
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

భద్రాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని టిమ్స్ డ్రైవర్లు స్పష్టం చేస్తున్నారు. టిమ్స్ డ్రైవర్లు తాము వెళ్లే సర్వీసులకు అదనపు డ్రైవర్, కండెక్టర్‌ను ఇవ్వాలని.. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు మూడు మస్టర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నారు. దీంతో ఆర్టీసీ డిపో అధికారులు వారిని ఆర్ఎం వద్దకు చర్చలకు వెళ్లాలని సూచిస్తుండగా.. వారు ఆర్ఎం ఇక్కడకు రావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో టిమ్స్ డ్రైవర్ల సమస్య పరిష్కారానికి నోచుకోకుండా మరింత జఠిలంగా మారుతోంది. డిపో అధికారి స్థాయిలో సమస్యకు పరిష్కారం ఉండగా కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. భద్రాచలం డిపో నుంచి 33టిమ్స్ సర్వీసులు వెళ్లాల్సి ఉండగా.. 20 సర్వీసులు వెళ్లినట్టు అధికారులు పేర్కొంటున్నారు. కాగా టిమ్స్ డ్రైవర్లు డిపో వద్దే ఉంటున్నారు. ఇదిలా ఉండగా ప్రత్యామ్నాయంగా అధికారులు ఖమ్మం, కొత్తగూడెం ఇతర డిపోల నుంచి టిమ్స్ సర్వీసులను నడుపుతున్నట్లు తెలుస్తోంది.

కాగా.. టిమ్స్ డ్రైవర్ల సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి అవసరమైతే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడతానన్నారు. ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల ఆరోగ్య సమస్య పరిష్కారానికి తెలుపుతున్న నిరసనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య సైతం ఆర్ఎంతో మాట్లాడి భద్రాచలం వచ్చి డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని సూచించినట్టు సమాచారం. మరోవైపు.. టిమ్స్ డ్రైవర్ల నిరసనకు రాజకీయ పక్షాలు, పలువురు కార్మిక సంఘాల నాయకులు తమ మద్దతును ప్రకటించారు.

అటవీశాఖ సిబ్బంది ఆటవిడుపు!

ఏకంగా జిల్లా కార్యాలయంలోనే పేకాట

సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, ఫొటోలు వైరల్


అటవీశాఖ కార్యాలయంలో పేకాట ఆడుతున్న ఆ శాఖ సిబ్బంది

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అది జిల్లా కేంద్రంలో ఉన్న అటవీశాఖ జిల్లా కార్యాలయం. శాఖా పరంగా పలు పలను కోసం వచ్చే ప్రజలకు సేవలందించాల్సిన స్థలం. కానీ దాన్ని పేకాట స్థావరంగా మార్చేశారు కొందరు ఉద్యోగులు, సిబ్బంది. అక్కడ నిత్యం విధుల్లో ఉండాల్సిన సిబ్బంది మాత్రం తమ ఆటవిడుపును పేకాట రూపంలో ప్రదర్శించారు. కొలువు చేయాల్సిన కార్యాలయాన్నే స్థావరంగా మార్చేశారు. ఇది అటవీశాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో చోటు చేసుకున్న సంఘటన. కాగా కార్యాలయంలోని కొందరు సిబ్బంది, ఉద్యోగులు కలిసి పేకాట ఆడుతున్న వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ప్రజలు మండిపడుతున్నారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ విధులు నిర్వర్తించడంతోపాటు, చట్టాన్ని రక్షించే అధికారులే ఇలాంటి చర్యలకు పాల్పడటం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే కార్యాలయంలో పేకాట ఆడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతటి స్థాయిలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో పాటు ఏకంగా కార్యాలయాన్ని పేకాట అడ్డాగా మార్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వెనుక అంతర్యమేంటనే విషయంపై ప్రస్తుతం జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. వారి పర్యవేక్షణ తీరు తేటతెల్లమవుతోంది. కాగా ప్రస్తుతం ఈ సంఘటన ఏకంగా శాఖ మొత్తానికి తలవంపుగా మారింది. దీనిపై ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. అయితే ఈ వ్యవహారం సోషల్ మీడియాలో చక్కర్లుకొడుతున్న క్రమంలో విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అయితే సంఘటనకు సంబంధించి శాఖపరంగా ఎలాంటి చర్యలు చేపడతారన్నది వేచిచూడాల్సిందే.

యూరియా కోసం 'సరిహద్దు' రైతులు..

తెలంగాణలోని బంధువుల

సాయం కోరుతున్న వైనం


భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు యూరియా కోసం తెలంగాణ ప్రాంత రైతులు అవస్థలు పడుతుండగా.. ప్రస్తుతం సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ రైతులు కూడా పాట్లు పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ యూరియా కొరత ఉండడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సరిహద్దు మండలాల్లో ఉన్న తమ బంధువులు, తెలిసిన వారిని అక్కడి రైతులు ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడి రైతులు కొందరు యూరియా బస్తాల కోసం దుమ్ముగూడెం మండలంలోని తమ బంధువులను సంప్రదించి వారికి డబ్బుఇచ్చి పంపుతున్నారు. యూరియా కట్టల కోసం క్యూలైన్లో నిలుచున్నందుకు గాను రోజు కూలీగా రూ.300 వరకు ఇస్తున్నట్టు తెలుస్తోంది. అయితే స్థానిక రైతులకే సరిపడా యూరియా దొరకని పరిస్థితి ఉన్న సమయంలో వచ్చే అరకొరా సరఫరాలో కొంత సరిహద్దులు దాటి వెళ్తే ఇక్కడి పరిస్థితేంటని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే దుమ్ముగూడెం సొసైటీ కార్యాలయం ఎదుట బుధవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచే యూరియా కోసం రైతులు క్యూలైన్లో నిలబడ్డారు. తీరా పది గంటలకు కార్యాలయం తెరవగా, ఈ రోజు యూరియా లోడురాదని చెప్పడంతో రైతులు నిరాశ చెందారు. సరైన సమాచారం లేకపోవడంతో పాటు దొరుకుతుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. చివరకు తదుపరి పంపిణీ కోసం ఏఈవోలు రైతులకు టోకెన్లు ఇచ్చి పంపారు.

చంద్రుపట్ల పెద్దచెరువు కట్టకు నెర్రెలు

పొంచి ఉన్న ప్రమాదం... రైతుల్లో ఆందోళన

మరమ్మతులకు పీఆర్ శాఖ చర్యలు


పెద్దచెరువు కట్టకు నెర్రలు ఇచ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలోని పెద్దచెరువు కట్టపై బీటీ రోడ్డుతో పాటు, కట్ట లోపల భాగంలో నెర్రలు ఇచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ చెరువు కట్టపై భాగం తడిసి మట్టి జారటంతో ఈ పరిస్థితి వచ్చింది. దీంతో ఈ చెరువు కట్ట నెర్రలు ఇవ్వటంతో వర్షాలకు తడిసి మరింత కట్ట బలహినపడి ప్రమాదకరంగా మారే ఆవకాశం ఉంది. దీంతో ఈ చెరువు పరిధిలో గల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు పరిధిలో సుమారు 300 ఎకరాల ఆయుకట్టు విస్తరించి ఉంది. దీంతో పాటుగా కట్ట పైభాగం పొడవున ఒక కిలో మీటరు వరకు చంద్రుపట్ల టు ఎర్రబోయనపల్లి వరకు బీటీ రహదారి కూడా ఉంది. ఈ రహదారి ఇటు రైతులకు, అటు ప్రజలకు నిత్యం సౌకర్యంగా ఉంది. అధికారులు ముందస్తుగా స్పందించి ఈ చెరువు ప్రమాదకరంగా మారిన చోట సత్వరమే మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు, ప్రజలు కోరారు. ఈ చెరువు కట్టపై భాగం రహదారితో పాటుగా, కట్ట లోపల భాగం నెర్రలు ఇచ్చిన విషయం తెలుసుకున్న రైతులు జలవనరుల, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సత్వరమే అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెరువు కట్ట ప్రదేశాన్ని మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు కాటంనేని భాబురావు, జక్కంపూడి కిషోర్, కాటంనేని రామారావు తదితరులు అధికారులను డిమాండు చేశారు. బుధవారం పంచాయతీ రాజ్ శాఖ డీఈ రాంబాబు క్షేత్రస్థాయిలో సదరు చెరువు కట్ట, బీటీ రహదారి నెర్రలు ఇచ్చిన ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. వర్షాకాల సీజన్ కావటంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయటం జరుగుతుందన్నారు. వేసవి సీజన్‌లో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించటం జరుగుతుందని ప్రస్తుతానికి ఈ చెరువు కట్టకు అంతగా ప్రమాదం ఉండదని తెలిపారు.

పెట్టుబడి పెట్టి మోసపోయిన మహిళ

దమ్మపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్ మెసేజ్ ద్వారా ఎన్ఎస్ఈ డిపార్టుమెంటు పేరు లింక్‌ను పంపి వ్యాపారంలో లాభం వస్తుందని నమ్మి పెట్టుబడిపెట్టి మోసపోయిన ఘటన దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లచ్చాపురం గ్రామానికి చెందిన కంపాటి చిలకమ్మ ఈ ఏడాది ఆగస్టు 10న టెలిగ్రామ్ మెసెజ్ ద్వారా వచ్చిన లింక్ ద్వారా రూ.2.80లక్షలు పెట్టుబడి పెట్టింది. అయినా లాభం రాలేదు దీంతో ఈ విషయాన్ని చిలకమ్మ ఎన్‌సి ఆర్‌పీలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫిర్యాదురాలు ఇచ్చిన ఆధారంతో సైబర్ ఖాతాదారుని ఖాతాను హోల్డ్‌లో పెట్టింది. ప్రస్తుతం ఆఖాతాలో రూ.80264 ఉన్నాయి. బాదితురాలు బుధవారం సాయంత్రం దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమెదు చేశారు.

ఇందులో మర్మమేంటి?

(5వ పేజీ తరువాయి)

విషయంలో ఓ కీలక అధికారి వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. ఈ విషయంలో సంబంధిత అధికారిపై శాఖాపరమైన విచారణ కూడా నిర్వహించి సస్పెన్షన్ వేటు వేశారు. అయితే వాస్తవానికి ఈ విషయంలో దేవాదాయశాఖ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించలేదనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ ధార్మిక సంస్థ సభ్యులు ఎంతో భక్తి ప్రపత్తులతో దేవస్థానంలో సదనం నిర్మాణానికి రూ.18లక్షలు విరాళం అందజేయగా అవి ఆ కీలక అధికారి మూడో వ్యక్తి ఖాతాకు జమ చేయించినట్టు ప్రచారం సాగింది. అయితే రశీదులు ఇవ్వకపోవటం, పని గురించి చెప్పకపోవటంతో ధార్మిక సంస్థ ప్రతినిధుల ద్వారా ఆ విషయం వెలుగులోకి వచ్చింది. అధికారులు ఈ విషయంలో మరింత ముందు చూపుతో వ్యవహరించి ఉంటే దేవస్థానానికి భారీ విరాళం లభించి ఉండేదని రామభక్తులు సైతం పేర్కొంటున్నారు. అంతటి ప్రాధాన్యత అంశాన్ని దేవాదాయశాఖ అధికారులు ఇప్పటికీ పరిగణలోకి తీసుకోకపోవటం పట్ల రామభక్తులు ఆవేదన చెందుతున్నారు.

నియామకం.. జీతం చెల్లింపులపై అభ్యంతరాలు..

గతంలో ఇక్కడ కీలక బాధ్యతలు నిర్వహించి చక్రం తిప్పిన ఉద్యోగిని మళ్లీ రప్పించే ప్రయత్నాలు సాగుతున్నట్టు ప్రచారం ఉంది. వాస్తవానికి దేవాదాయశాఖలో అలాంటి పోస్టు లేకపోయినా ఆ పోస్టుకు జీతం చెల్లించడం పట్ల ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రికవరీ చేయాలని అధికారులకు సూచించిన దేవదాయ శాఖ ఉన్నాతాధికారులు ఆ విషయంలో అంటీముట్టనట్టు వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా మరో అధికారి దేవాదాయశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగితో అనుచితంగా, ఆర్థికపరమైన వ్యవహారాల్లో అమర్యాదగా ప్రవర్తించడంతో ఉన్నాతాధికారులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ ఘటన చోటుచేసుకోగా కేవలం హెచ్చరిక ఉత్తర్వులతోనే సరిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో స్టోర్‌లో అవకతవకలు

ఇదిలా ఉండగా రామాలయంలోని జనరల్ స్టోర్‌లో గతంలో బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగి హయాంలో రూ.12లక్షల వరకు అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉండగా సదరు ఉద్యోగి దీర్ఘకాలంగా సస్పెన్షన్‌లో ఉన్నారు. అయితే ఆ నగదు ఇంకా దేవస్థానం ఖజానాకు జమ కాలేదని తెలుస్తోంది. అంతేకాదు ఇంకో ఉద్యోగి రూ.2లక్షలు, మరో ఉద్యోగి రూ.1.50లక్షలు దేవస్థానంలో బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేశారు. అయితే వారి నుంచి కూడా నగదు దేవస్థానానికి జమ కాలేదని సమాచారం. ఈ విధంగా రామయ్య సొమ్ములు కాజేస్తున్నా, అవకతవకలకు పాల్పడుతున్నా దేవస్థానం ఉద్యోగులపై సరైన రీతిలో చర్యలు తీసుకోకపోవడంతో వారి ప్రవర్తన తీరులో మార్పులు రావడం లేదని రామభక్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఈ అంశాలపై దృష్టి సారించాలని రామభక్తులు కోరుతున్నారు.

'పీఎం కుసుమ్'కు ప్రోత్సాహం కరువు

(5వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడం అక్కడ రైతులకు ఎక్కువశాతం పట్టాలు లేవు. బ్యాంకులకు రిజిస్ట్రేషన్ చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఖాళీగా ఉన్న పోడుభూములను సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. పోడుభూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తే గిరిజన రైతులు కూడా ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతుకు నెలకు రూ.5వేల నుంచి రూ.6వేల విలువైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఏడాదికి రూ.55లక్షల నుంచి రూ.60లక్షల వరకు ఆదాయం వస్తుంది. 15 ఏళ్లలో బ్యాంకు రుణం తీరనుంది. ప్రస్తుతం నెలకు రైతుకు బ్యాంకు కిస్తీలు, అన్ని ఖర్చులు పోను రైతులు నెలకు రూ.50వేలు ఆదాయం పొందవచ్చని 15 ఏళ్లతర్వాత పూర్తి ఆదాయం నెలకు రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు కూడా ఈపథకం పట్ల ఆసక్తి చూపుతున్నారు. తద్వారా రైతులకు అదనపు ఆదాయం కలుగుతుంది. రుణం బకాయితీరిన తర్వాత రైతుకు సొంతమవుతుంది.

ఉమ్మడి జిల్లా రైతుల ఆసక్తి..

పీఎం కుసుమ్ కింద సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుచేసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులు ఆసక్తిచూపుతున్నారని, ఇప్పటికే ఖమ్మంజిల్లాలో 35మంది, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 13మంది రైతులతో ఎన్పీడీసీఎల్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేశామని టీఎస్ రెడ్కో జిల్లా మేనేజర్ పి.అజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బ్యాంకులు త్వరితగతిన రుణాలు మంజూరు చేస్తే యూనిట్లు త్వరగా ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కలుగుతుందని, రోజుకు ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి జరిపితే 4వేల నుంచి 4500 యూనిట్ల వరకు సోలార్ విద్యుత్‌ను విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు.

పిడుగుల వాన..

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పిడుగులు

ఉమ్మడి జిల్లాలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. ఖమ్మం జిల్లా మధిర, సత్తుపల్లి, కామేపల్లి, భద్రాద్రి జిల్లా గుండాల మండలాల్లో ఈ ఘటనల్లో ముగ్గురు మృతిచెందగా.. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు రైతులు ఉండగా.. ఒకరు యువకుడున్నారు. ఈ ఘటనలు ఆయా గ్రామాలు, కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.


వీరభద్రరావు మృతదేహం

మడుపల్లిలో రైతు మృతి..

మధిర రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపడి రైతు మృతిచెందిన సంఘటన ఖమ్మం జిల్లా మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సన్నకారు రైతు అయిన గడిపూడి వీరభద్రరావు(53)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో మిరప పంట సాగుచేశాడు. పొలంలో కలుపు తీయించేందుకు తన భార్య పద్మతో కలిసి పదిమంది కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. సాయంత్రం నాలుగుగంటల సమయంలో పొలంలో కలుపు తీయిస్తుండగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తున్న సమయంలో వీరభద్రరావుపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని ట్రాక్టర్ ద్వారా ఇంటికి తీసుకువచ్చారు. వీరభద్రరావు మృతితో కుటుంబంలోనూ, గ్రామంలోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

సోదరుడితో ఫోన్ మాట్లాడిన నిమిషాల వ్యవధిలో..

ఉదయం నుంచి పొలం పనుల్లో ఉన్న వీరభద్రరావు సాయంత్రం 4గంటల సమయంలో తన తమ్ముడు నారాయణరావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఫోన్ కట్ చేసిన అనంతరం రెండు నిమిషాల వ్యవధిలో పిడుగుపడగా.. ఆయన జేబులో ఉన్న ఫోన్ పగిలిపోయింది. ఈ విషయాన్ని తలచుకుంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పటివరకు అందరితో కలిసి పొలం పనుల్లో నిమగ్నమైన వీరభద్రరావు తమ్ముడితో ఫోన్ మాట్లాడిన అనంతరం కుప్పకూలిపోవడంతో ఘటనా ప్రదేశంలో ఉన్న భార్య గుండెలవిసేలా రోదించగా.. అక్కడున్న కూలీలు కూడా కన్నీటి పర్యంతమయ్యారు.

సత్యనారాయణపురంలో బీఆర్ఎస్ కార్యకర్త..

సత్తుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి యువకుడు మృతిచెందిన ఘటన సత్తుపల్లి మండలం సత్యనారాయణపురంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దరావత్ భాషా, కాంతం దంపతుల రెండవ కుమారుడు మహేష్ (32) గ్రామశివారు పాకలగూడెం వెళ్లే రోడ్డులో పశువులను మేపేందుకు వెళ్లిన సమయంలో భారీవర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపడటంతో తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారకస్థితికి చేరగా గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడు బీటెక్ విద్యార్థి కాగా గత ప్రభుత్వంలో గ్రామవార్డు మెంబర్‌గా బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించాడు. సమాచారం అందుకున్న మునిసిపల్ మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేష్, డాక్టర్ నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు చాంద్‌పాషా, అద్దంకి అనిల్, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్ తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా మహేష్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చరవాణి ద్వారా ఓదార్చారు.

పిడుగుపాటుకు రైతుకు తీవ్రగాయాలు

కామేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు ఓ రైతుకు తీవ్రగాయాలు అయిన సంఘటన కామేపల్లి మండలం పండితాపురం బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పండితాపురం గ్రామానికి చెందిన గుగులోత్ బావ్‌సింగ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో కూలీలలతో మిరపతోట వేయిస్తున్నాడు. ఇంతలో ఒకసారిగా వర్షం రావడంతో ఇంటికి వద్దామని బయలుదేరెలోపే అతనికి దగ్గర్లో ఓ పిడుగుపడింది. దింతో అతని ముందు శరీర భాగం పూర్తి కాలిపోయింది. 108 సహాయంతో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


మృతి చెందిన పాయం నర్సయ్య

'గుండాల'లో రైతు కన్నుమూత

గుండాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీమల గూడెం గ్రామానికి చెందిన పాయం నర్సయ్య(50) ప్రతీ రోజులాగానే మంగళవారం తన మొక్కజొన్న చేనులో కోతులు రాకుండా కాపలా కోసం వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం వస్తుండటంతో చేనులోని మంచెపైకి ఎక్కాడు. మంచెను ఆనుకొని ఉన్న చెట్టుపై పిడుగు పడటంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి 8గంటల వరకు ఇంటికి రాకపోవడంతో స్థానికులు రాత్రి పూట వెతుకుతూ చేను వద్దకు వెళ్లగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి శరీరం కొంత భాగం కాలిపోయింది. కుటుంబ సభ్యుల పిర్యాధు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లందు తరలించారు.

ముగ్గురు వ్యవసాయ కూలీలకు అస్వస్థత

టేకులపల్లి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురైన ఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల ప్రకారం సుజాతనగర్ మండలంలోని స్టేషన్ బేతంపూడికి చెందిన రైతు జారె నాగేంద్రబాబు పొలంలో టేకులపల్లి మండలం తూర్పుగూడెంకు చెందిన వ్యవసాయ కూలీలు కలుపు తీస్తుండగా బుధవారం ఉరుములతో వచ్చిన వర్షానికి పిడుగుపడడంతో కూలీలు ఈసం రాజమ్మ, కొడెం పాపమ్మ, గొగ్గెల శిరీషలు అస్వస్థతకు గురయ్యారు. పక్కనున్న రైతులు, వారికి ప్రథమ చికిత్స నిర్వహించి ఆస్పత్రికి తరలించారు.

పోరాటాలతోనే రైతు సమస్యలు పరిష్కారం

రైతాంగ సమస్యలను పరిష్కరించటంలో పాలకులు విఫలం


ఎస్‌కేఎం జిల్లా సదస్సులో పాల్గొన్నరైతుసంఘాల నేతలు


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకుడు గుమ్మడి నర్సయ్య

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, పోరాటాల ద్వారానే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని రైతుసంఘం నేతలు పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్‌ఫాం అఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్, నాయకుడు రాము అధ్యక్షతన జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. పాలకుల విధానాలతో రైతులు నష్టాల ఊబిలోకి నెట్టబడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఐక్యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మడి నర్సయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారయణ, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్‌లు ఆరోపించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైతులకు యూరియాను పంపిణీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఈ సదస్సులో నాయకులు సలిగంటి శ్రీనివాస్, బుర్రా వెంకన్న, బానోత్ ఊక్లా, కోరం వెంకటేశ్వర్లు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు సొసైటీ అధ్యక్షుడిగా పాండురంగారావు

గడువు ముగిసినా పంటరుణం చెల్లించకపోవడంతో ప్రస్తుత చైర్మన్ భిక్షం డైరెక్టర్ పదవి నుంచి తొలగింపు


కొమ్మినేని పాండురంగారావు

జూలూరుపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు సొసైటీ నూతన అధ్యక్షుడిగా (పర్సన్ ఇన్‌చార్జ్‌గా) కొమ్మినేని పాండురంగారావు బుధవారం బాధ్యతలను స్వీకరించినట్లు సీఈఓ రమణారెడ్డి తెలిపారు. ప్రస్తుత సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం వాయిదా గడువులోగా తాను తీసుకున్న పంట రుణాన్ని చెల్లించకపోటంతో నిబంధనల ప్రకారం ఓవర్ డ్యూ(ఓడీ) ఉండటంతో డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తూ డీసీవో ఏ.శ్రీనివాసరావు ఉత్తర్వులను జారీ చేశారన్నారు. అదే విధంగా కాకర్ల డైరెక్టర్ అల్లాడి రజని గడువు ముగిసినప్పటికీ తీసుకున్న పంట రుణాన్ని చెల్లించకపోటంతో ఆమెను కూడా డైరెక్టర్ పదవి నుంచి తొలగించినట్లు తెలిపారు. మొత్తం 13మంది డైరెక్టర్లు సొసైటీ పరిధిలో ఉన్నారని వారిలో ఇద్దరిని తొలగించగా 11మంది పర్సనల్ ఇన్‌చార్జ్‌లు ఉన్నట్లు తెలిపారు. వారిలో సీనియర్ కావటంతో కొమ్మినేని పాండురంగారావును సొసైటీ చైర్మన్ (పర్సన్‌ఇన్‌చార్జ్)గా డీసీవో నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేయటం జరిగిందన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను తోటి పర్సన్ ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

మున్నేరు బ్రిడ్జిపై ట్రాఫిక్ ఆంక్షలు

ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ

ఖమ్మంక్రైం/ఖమ్మం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు బ్రిడ్జిపై నేటి నుంచి 14వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం జరుగుతు న్న నేపథ్యంలో భారీ యంత్రాలను తీసుకురావడంతో నాలుగు రోజుల పాటు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు సీఐ తెలి పారు. వాహనదారులు ఆంక్షలు ఉన్న సమయంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

మనస్తాపంతో ఆర్టిజన్ ఆత్మహత్య


పాల్వంచ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాతీనొప్పి తరచూ ఇబ్బంది పెడుతుండటంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసారు. పాత పాల్వంచకు చెందిన గొట్టిముక్కల కోటేశ్వరరావు(48) స్థానిక కేటీపీఎస్ కర్మాగారంలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా చాతీ నొప్పి మరింతగా వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులకు బయటకు వెళ్ళి వస్తానని చెప్పి ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆమె భార్య శివలక్ష్మి తన కుటుంబీకులతో చెప్పి అతని ఆచూకీ కోసం ప్రయత్నించింది. ఈ క్రమంలోనే పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో ఆమె భర్త గుర్తు తెలియని పురుగుమందు సేవించి అపస్మారకస్థితిలో పడిఉన్నాడని తెలుసుకుని అక్కడకు చేరుకుంది. హుటాహుటిన భర్తను వరంగల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందాడని నిర్ధారించారు. తన భర్త చాతీ నొప్పితో ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరిపై ఎటువంటి అనుమానం లేదని శివలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ తెలిపారు.

భార్యపై భర్త హత్యాయత్నం

దమ్మపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త హత్యాయత్నం చేసిన ఘటన బుధవారం సాయంత్రం దమ్మపేట మండలం గండుగులపల్లి ఏకలవ్య పాఠశాల గేటు వద్ద జరిగింది. ఈ ఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరి జిల్లా టి.నర్సాపురం మండలం సోములపాలెంకి చెందిన మనేశ్వరిని భద్రాద్రికొత్తగూడెంజిల్లా దమ్మపేట మండలం టిఎం గుంపు వాడే బుజ్జిబాబుతో కొంతకాలం క్రితం వివాహమైంది. కొద్దికాలంగా మధ్య మనస్పర్ధలు రావటంతో వీరు విడివిడిగా ఉంటున్నారు. కాగా మునేశ్వరి పిల్లలు ఏకలవ్య పాఠశాలలో చదువుతుండగా వారిని చూసేందుకు సోదరి సుంకరమ్మతో కలిసి గండుగుపల్లి పాఠశాలకు వచ్చి గేటు వద్ద వేసి చూస్తుంది. ఈవిషయం తెలుసుకున్న బుజ్జిబాబు గండుగులపల్లిలో ఉన్న భార్య దగ్గరకు వచ్చి తనతో తెచ్చుకున్న కొడవలితో దాడి చేసాడు. దీంతో మునేశ్వరి మెడవద్ద, చేతికి గాయమై రక్తస్రావమైంది. సోదరి సుంకరమ్మ ఫిర్యాదుమేరకు దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు.

ఇంకుడుగుంతలో పడి చిన్నారి మృతి

సత్తుపల్లి మండలం సత్యంపేటలో విషాదం


మోక్షదుర్గ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ ఇంకుడుగుంతలో పడి ఓ చిన్నారి మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం సత్యంపేటలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్యంపేట గ్రామానికి చెందిన సోయం శివ, సంధ్య దంపతుల ఏడాదిన్నర వయసున్న కుమార్తె మోక్షదుర్గ మంగళవారం సాయంత్రం ఇంటివద్ద ఆటలాడుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో నీటితో నిండి ఉన్న ఇంకుడు గుంతలో ప్రమాదవశాత్తూ పడింది. కొంత సేపటి తర్వాత మోక్షదుర్గ కనిపించడంలేదంటూ కుటుంబ సభ్యులు వెతకగా నీటిసంపులో తేలియా డుతూ కనిపించింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ గ్రామంలో విషాదం అలముకోగా తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్నారి మృతివార్త తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఆమె భర్త, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో నానమ్మ, మనువరాలు మృతి

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడలో బెజ్జాల సత్యవతి(54), గీతాశిరీషా(4) అనే నానమ్మ మనువరాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికులు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యవతికి ఇద్దరు కుమారులు కాగా, ఒక కుమారుడు హిజ్రాగా మారాడు. మంచిర్యాల పట్టణంలోని గోపాలవాడలో ఇంటిని నిర్మించుకొని జీవనం సాగించాడు. కొంత కాలం క్రితం మృతి చెందాడు. దీంతో సత్యవతి ఆ ఇంటిని అమ్మేందుకు కుమారుడు గంగోత్రి, మనువరాలు శిరీషతో కలిసి ఇల్లు అమ్మకం కోసం ఖమ్మం నుంచి మంచిర్యాలకు వచ్చారు. గంగోత్రికి ఆరోగ్యం బాగలేకపోవడంతో ఖమ్మంకు తిరిగి వెళ్లిపోయాడు. బుధవారం తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటివారికి ఫోన్‌చేశాడు. గది తలుపులు వేసి ఉండగా ఎంత పిలిచిన వారు పలుకక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తలుపు తెరిచిచూడగా మంచంపై సత్యవతి, గీతా శిరీష అనుమానాస్పదంగా మృతిచెందారు. వీరు ఆత్మహత్య చేసుకున్నారా లేదా హత్య చేయబడ్డారా అని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'స్వస్థనారి - సశక్తి పరివార్'ను విజయవంతం చేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం కలెక్టరెట్, సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా సక్రమంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా, బలంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారి - సశక్తి పరివార్ అభియాన్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమ నిర్వాహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులతో బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. మహిళ ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఒక మైలు రాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని పల్లె దావాఖానాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల పరిధిలోని ప్రతీ మహిళలకు ఈ వైద్య శిబిరాల ద్వారా సమగ్ర ఆరోగ్య సేవల గురించి వివరించాలని ఆయన సూచించారు. మారినజీవన శైలి పర్యావరణ పరిస్థితుల కారణంగా మహిళలు అధికంగా బీపీ, షుగర్, హృద్రోగ వ్యాధులు, క్యాన్సర్, పీసీఓడీ, రుతుక్రమణ సమస్యలు వంటి వ్యాధులకు గురవుతున్నారని ఈ హెల్త్ క్యాంపుల ద్వారా రోగ నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స, అవసరమైన మందులు అందించబడతాయని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్య మహిళ, ఎన్‌సీడీ సెంటర్‌లు, కాన్సర్ డేకేర్ సెంటర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని వివరించారు. ప్రతీ ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో ఔషద మొక్కలను ప్రదర్శించి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా పేద మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియేగం చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యశాఖ అధికారి విజయలక్ష్మీ, డీసీహెచ్‌వో రవిబాబు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా, మునిసిపల్ కమిషనర్‌లు సుజాత శ్రీకాంత్, వైద్యులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్


హాజరైన అధికారులు

మధిరలోని 5 మండలాల్లో పైలెట్ ప్రజావాణి అమలు

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారితనంతో పని చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. టీటీడీసీ మీటింగ్ హాల్‌లో మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో చేపట్టనున్న పైలెట్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై బుధవారం అధికారులకు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమం తరహాలో మధిర నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లో పైలెట్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రజావాణి కార్యక్రమం అమలులో అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సానుకూలంగా ఉన్న ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని, చేయలేని దరఖాస్తులకు తప్పనిసరిగా కారణాలు తెలియజేస్తూ లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలోనే ప్రజలకు సమస్యలు పరిష్కారం కావాలని కలెక్టర్ తెలిపారు. మండలంలో ఐఎఫ్‌సీ (ఇన్ఫర్మేషన్ ఫెసిలిటేషన్ సెంటర్) ద్వారా దరఖాస్తులు తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. - కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ పైలెట్ ప్రజావాణి కార్యక్రమం క్రింద మండల కేంద్రంలోని ఐఎఫ్‌సీ సెంటర్‌లో సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి రశీదు అందించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చన్నారు. ఐఎఫ్‌సీ సెంటర్ ద్వారా దరఖాస్తుల స్థితిగతులను కూడా తెలుసుకోవచ్చని, ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో దరఖాస్తుల స్టేటస్ సమాచారం అందుతుందన్నారు. ఐఎఫ్‌సీ ద్వారా దరఖాస్తులు సంబంధిత అధికారులకు పైలెట్ ఐటీ సిస్టం ద్వారా చేరుతాయని, ప్రతి నెల మండలస్థాయిలో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి ప్రజావాణి దరఖాస్తుల స్థితిగతులపై వచ్చే ఫిర్యాదులకు సంబంధిత అధికారులు సమాధానం చెబుతారని, మండలస్థాయి అధికారులంతా పబ్లిక్ హియరింగ్‌కు హాజరు అవుతారని తెలిపారు. పైలెట్ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ సంబంధిత అధికారులు 30 రోజులలో రిపోర్టు సమర్పించాల్సి ఉంటుందన్నారు.ఈ సందర్బంగా పైలెట్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ, ఎస్‌ఓపీలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సఫర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, మధిర నియోజకవర్గ 5 మండలాల అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కరీనా, శ్రీహర్ష, అఖిల్ సూర్య, రైతు స్వరాజ్య వేదిక, కిసాన్ మిత్ర, ఏఎస్ డిఎస్, జాగృతి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో సమస్యలా..

9868200445 నెంబర్‌కు కాల్ చేయండి

ప్రతీ రేషన్ దుకాణంలో ప్రదర్శన

డీఎస్వో చందన్‌కుమార్


సీఎంఆర్ బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్వో చందన్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీలో లబ్ధిదారుల సమస్యలు, ఇబ్బందుల పరిష్కారం కోసం కేంద్రప్రభుత్వం అన్నా సహాయత పేరుతో ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆహార భద్రతకార్డు దారులకు చేరువయ్యే లక్ష్యంతో ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ (అన్నా సహాయత)ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. లబ్ధిదారులు, ప్రజలు తమకు రేషన్ పంపిణీలో సమస్యలు ఉంటే ఫిర్యాదులు ప్రత్యేక హెల్ప్‌లైన్ ద్వారా వాట్సప్ నెంబరు 9868200445 ఐవీఆర్ఎస్ 14457 ద్వారా వాయిస్‌తో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు తమ పరిధిలోని చౌక ధరల దుకాణాల్లో ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ(అన్నా సహాయత), హెల్ప్ లైన్-3 9868200445 ఐవీఆర్ఎస్ నెంబర్ 14457622ను ప్రదర్శనకు పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్బంగా బుధవారం డీఎస్వో చందన్‌కుమార్ నేలకొండపల్లి మండలం అన్నా సహాయత ఫిర్యాదు వ్యవస్థపై డీలర్లకు, కార్డుదారులకు అవగాహన కల్పించారు. సరఫరా చేస్తున్న బియ్యం, నాణ్యతపై కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ రేషన్ దుకాణాల్లో తనిఖీ చేశారు.

మిల్లులను తనిఖీ చేసిన డీఎస్వో

జిల్లాలోని అన్నీ మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని పూర్తి చేసి అందించాలని జిల్లా పౌరసఫరాల అధికారి చందన్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లాలో వివిధ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. శ్రీ సత్యసాయి, రైస్ మిల్, ముదిగొండ మండలంలో తనిఖీ చేసి గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించినారు. నిర్ధేశిత సమయంలోగా వీటిని ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. అనంతరం నేలకొండపల్లి పాఠశాలలో పిల్లలతో పాటు తమకు అందించే భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలానే వంట గది, భోజనం వడ్డించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన - కేసు నమోదు చేసిన పోలీసులు


ప్రసాద్ (ఫైల్)

కరకగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమళ్ళ పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో బుధవారం జరిగింది. కరకగూడెం ఎస్ఐ పీవీ నాగేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. కరకగూడెం మండలం చిరుమళ్ళ పంచాయతీ పోలక మ్మతోగు గ్రామానికి చెందిన ఊకే ప్రసాద్(35) తన తల్లిదండ్రులు కొంతకాలం క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. అప్పటి నుంచి ప్రసాద్ ఇట్టికి రాకపోవడంతో బంధువులు పలుచోట్ల ఆయన ఆచూకి కోసం వెతికారు. బుధవారం రాయణపేట గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ముత్యాలమ్మ చెరువు ఒర్రె వద్ద దుర్వాసన వస్తుండడంతో స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా వ్యక్తి మృతదేహం ఆనవాళ్లను సేకరించారు. మృతుడు బంధువులు ఊకే నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసి శవపరీక్ష చేపించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కరెంట్ సామగ్రి చోరీ


టవర్ లెగ్‌ను, వైర్లను చోరీ చేసిన దుండగులు

మణుగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రధాన రహదారికి పక్కన ఉన్న మెయిన్ లైన్ టవర్ల సామగ్రిని దొంగిలించారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న 500 మీటర్ల పొడవు ఉన్న అల్యూమినియం వైర్‌ను సైతం అపహరించారు. రెండు రోజుల క్రితం రామానుజవరం గ్రామం వద్ద టవర్‌కు సంబంధించిన వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు కాంట్రాక్టర్ మురళి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత


పట్టుబడిన ఇసుక లారీ

బూర్గంపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని బుధవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామ శివారులో గల కిన్నెరసాని వాగు నుంచి బుధవారం తెల్లవారుజామున లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టారు. దాడుల్లో భాగంగా ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ పరారయినట్లు పోలీసులు తెలిపారు.

హైవేపై కారు పల్టీ

యువకుడికి స్వల్పగాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ముదిగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై కారు పల్టీకొట్టడంతో ఓ యువకుడికి స్వల్ప గాయాలైన సంఘటన ముదిగొండ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఖమ్మం నగరానికి చెందిన ఆసీఫ్ అనే యువకుడు కోదాడ నుంచి ఖమ్మం వెళ్తుండగా అదుపుతప్పి కారు పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆసీఫ్‌కు స్వల్పగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది.



అనారోగ్యంతో కాంగ్రెస్ నేత రాంరెడ్డి మృతి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలువారిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీసీనియర్ నేత మద్దికుంట్ల రామిరెడ్డి (75) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, రాంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మద్దికుంట్ల గోపాల్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా రఘునాథపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రామడుగు వెంకటరావు (80) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎంపీపీ మంగిలాల్, జడల నగేష్ ఓర వెంకటేశ్వర్లు, అంబేద్కర్‌లు సందర్శించి నివాళులర్పించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

» కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కఠినమైన చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. బుధవారం ఉదయం 6గంటలకే నగరంలోని 10, 11, 12 డివిజన్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. కార్మికుల హాజరు రికార్డులను తనిఖీలు చేశారు. 11 వ డివిజన్‌లో కాల్వలో చెత్త నిల్వపై ఏఎంసీని ఆదేశించారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయని కమిషనర్ స్థానికులతో మాట్లాడారు. ఖాళీ స్థలాలపై ఆరా తీశారు. ఖాళీ స్థలాల్లో బోర్డులు పెట్టి నోటీసులు ఇవ్వాలని, డివైడర్ల పక్కన మట్టి, దుమ్ము లేకుండా శుభ్రం చేయాలని స్వీపింగ్ మిషన్లు సక్రమంగా నిర్వాహణ చేపట్టాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో చలపతిరావు

నేలకొండపల్లి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులను మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని మండల విద్యాధికారి బాలిన చలపతిరావు అన్నారు. బుధవారం సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నం, కూరలు చాలా బాగున్నాయని, కూరల్లో కొంచెం కారం తగ్గించాలని వంట ఏజన్సీ నిర్వాహకులకు సూచించారు. మొత్తం మీద భోజనం బాగా వండుతున్నారని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కేంద్రమంత్రి రాందాస్‌ను కలిసిన ఆర్‌పీఐ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర న్యాయశాఖ మంత్రి రాందాస్ అథావాలేను ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరికంటి సంజీవరావు, జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు బరిగెల నాగేశ్వరరావు తదితరులు బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో దిగే అంశాలపై కేంద్రమంత్రితో చర్చించినట్లు సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలని ధర్నా



మునిసిపల్ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని 12 గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యర్రా శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం వ్యకా.సం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నంద్రా ప్రసాద్, నాగేశ్వరరావు, పొన్నేకంటి సంగయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యారంగంపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం

» ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రామకృష్ణ



మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలు పరిష్కరించకుండా వివక్ష చూపుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకు విద్యా వ్యవస్థలో సమస్యలు పెరిగిపోతున్నాయని కనీసం విద్యాశాఖ మంత్రిని నియామకం చేయడం లేదని ఆరోపించారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివనాయక్, వంశి, గోపి, పవన్, నరేందర్, నాగరాజు, ప్రతాప్, రాకేష్, లోకేష్ పాల్గొన్నారు.

తిరమలాయపాలెంలో ఎస్‌బీఐ సేవలు ప్రారంభం

తిరుమలాయపాలెం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తిరుమలాయపాలెంలో బుధవారం నుంచి ఎస్‌బీఐ సేవలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకులేక ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బుధవారం తిరుమలాయపాలెంలో బ్యాంకు సేవలు ప్రారంభమయ్యాయి. బ్యాంక్ సేవల ప్రారంభంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కొండబాల కరుణాకర్, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీను, బోడ మంగిలాల్, కమ్మకోమటి నాగేశ్వరరావు, మండడి ఇజ్రాయేల్, చంద్రశేఖర్, కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

పోరాటస్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోరాట స్ఫూర్తికి ప్రతీక... వీర వనిత చాకలి ఐలమ్మ నిలుస్తారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీర వనితగా చరిత్రలో నిలిచి పోయారని అన్నారు. సంఘ సేవకురాలిగా, భూమి, భుక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని, ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, బీసీ సంఘ నాయకులు తుపాకుల ఎల్లగొండ స్వామి, నారాయణవరపు శ్రీనివాసరావు, కొత్తగాండ్ల శ్రీలక్ష్మి, జక్కుల వెంకటరమణ, తంబారపు బ్రహ్మం, పరిగల కృష్ణవేణి, నటు వెంకటేశ్వర్లు, మాచర్ల యాలాద్రి నగేష్, మననం శివరామకృష్ణ, ఎం. వెంకటప్పయ్య, బి. బాలకృష్ణ, బి. కృష్ణ, జి. వీరయ్య, జి. శ్రీనివాస్, జి. యల్లేశ్వరరావు, పిండిప్రోలు రామ్మూర్తి, శివరామకృష్ణ, ఎం. శ్రీనివాసరావు, పి. కృష్ణయ్య, మిట్టపల్లి శంకర్, గోనెల శివ ప్రసాద్, గోనెల రవిశంకర్, దాసరి నాగేశ్వరరావు, కె. గోవిందరావు, కొండలరావు తదితరులున్నారు.

ఖమ్మం కార్పొరేషన్: తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం చిట్యాల(సాకలి)ఐలమ్మ విరోచితంగా ఒక మహిళా శక్తి వలే పోరాటం చేశారని, ఆమె స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఉద్యాన అధికారిని బెల్లం రాధిక, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, వార్డు ఆఫీసర్లు, కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నాయకులు పాల్గొని ఐలమ్మ జీవితచరిత్రను వివరించారు. ఆమె స్ఫూర్తితో సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల(చాకలి)ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, బీజేపీ జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావులు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సుధాకర్, కృష్ణారావులు మాట్లాడుతూ దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన భూపోరాటం చేసిన ధీరురాలు ఐలమ్మ అన్నారు. ఐలమ్మను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, ప్రచార కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, నాయకులు సయ్యద్ మొహినుద్దీన్ బాజా రామకృష్ణ, కల్యాణం నాగేశ్వరరావు, గెల్లా నాగసాయి, కొండా హర్షవర్ధన్ పాల్గొన్నారు.

నైజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన ధీరురాలు, తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నేటి తరాలకు ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం రావెళ్ళ భవన్‌లో చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సభలో కేవిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. భూస్వాములు, పెత్తందార్లు, దొరలకు వ్యతిరేకంగా అట్టడుగు వర్గాలను ఐక్యం చేసి ఉద్యమించిన గొప్ప పోరాట యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో పగిడికత్తుల నాగేశ్వరరావు, సామాల మల్లికార్జునరావు, మున్నంగి లక్ష్మీ, బలుసు ప్రమీల, కూచిపూడి శ్రీదేవి తదితరులున్నారు.

ఖమ్మం చర్చికాంపౌండ్: వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఐలమ్మ 90వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాఉల భూక్యా ఉపేంద్రబాయి, ప్రధాన కార్యదర్శి బి.జ్యోతిలు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రమీల, సరోజిని, త్రివేణి, ఝాన్సీ తదితరులున్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ అని టీడీపీ నాయకులు కేతినేని హరీష్ అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి వివాహ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్నెటి పృథ్వీ, చింతనిప్పు నాగేశ్వరరావు, కొలికొండ మురళి, దామాల శివ, తాళ్లూరి నారాయణరావు, రాటకొండ ప్రసాద్, బోడెపూడి రవి, గంగవరపు అనంత్ కుమార్, మద్దినేని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య



సీపీఎం కార్యాలయంలో...



వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



తిరుమలాయపాలెంలో...



నేలకొండపల్లిలో...



కాకరవాయిలో....

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

» జిల్లా వైద్యాధికారి కళావతిబాయి



వాక్సినేషన్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి

నేలకొండపల్లి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, సీజనల్ జ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ కళావతిబాయి వైద్యులను ఆదేశించారు. బుధవారం నేలకొండపల్లి ప్రాథమిక వైద్యశాలను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈఔషధి, ఈ-సంజీవని, ఫేస్ఐడీ సేవలు ఎలా అమలవుతున్నది వైద్యులను అడిగి తెలుసుకున్నారు. టీకాల లభ్యత, వాటి నిర్వహణను పరిశీలించారు. టీకాల నిల్వ కోసం ఉపయోగించే ఐస్ ప్యాక్స్ ఎట్టి పరిస్థితుల్లో ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పైనంపల్లి, చెర్వుమాధారంలలో జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరానికి చెందిన వృద్ధురాలికి యశోద ఆస్పత్రిలో అరుదైన చికిత్స

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన మేదారపు జానకమ్మ అనే వృద్ధురాలు శ్వాసకోశ, గుండెసంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిని సంప్రదించగా అక్కడ పల్మోనాలజీ బృందం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా ఆమె ప్రాణాలు కాపాడిందని యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ బి.వి శ్వేశ్వరన్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో చేరే సమయానికి ఆమె పరిస్థితి విషమంగా ఉందని, ఆమెకు అధునాతన వైద్యం అందించి ఆమె ప్రాణాలు కాపాడామని తెలిపారు. అధునాతన పల్మనరీ కేర్, కార్డియాలజీ ద్వారా ఆమె ప్రాణాలు కాపాడామని పేర్కొన్నారు.

నాడు ఇప్పించారు.. నేడు ఫిర్యాదు చేశారు..

» కాంగ్రెస్ క్యాడర్‌కు సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదులు



రఘునాథపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రశాంతంగా ఉన్న రఘునాథపాలెం మండలంలో ఇప్పుడు ఆసరా పింఛన్లు అలజడి రేపాయి. అధికారంలో ఉన్న పార్టీ నాయకుల క్యాడర్, ప్రతిపక్ష పార్టీల క్యాడర్‌పై ఫిర్యాదులు చేయడం రాజకీయంగా చూస్తాం.. కానీ రఘునాథపాలెం మండలంలో అందుకు విరుద్ధంగా ఫిర్యాదుల వెల్లువ కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నుంచి పార్టీ మారితే సంక్షేమ పథకాలు అందిస్తామని నాడు పార్టీ కండువాలు మార్పిన నాయకులు, ఇప్పుడు తిరిగి వారిపైనే ఫిర్యాదులు చేయడంపై కాంగ్రెస్ క్యాడర్ గందరగోళానికి గురవుతుంది. అధికార పార్టీలో ఉండి కూడా ఇదేంటని నివ్వెరపోతున్నారు..

దశాబ్దాలుగా రఘునాథపాలెం మండలం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. సుజాతనగర్ నియోజకవర్గంలో రఘునాథపాలెం(ఖమ్మం అర్బన్) ఉన్న నాటి నుంచి కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉంది. అయితే గత పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికే ఆసరా పింఛన్లు, రెండు పడకల ఇళ్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ వంటి పథకాలు అందిస్తామని పరోక్షంగా కండిషన్‌లు పెట్టారు. దీంతో కాంగ్రెస్ క్యాడర్ దశల వారీగా గులాబీ కండువాలు కప్పుకొని సంక్షేమ పథకాలు పొందారు. ఈ క్రమంలోనే కొంతమంది నాయకులకు కొద్దిపాటి అర్హతలు తక్కువగా ఉన్న ఓటు బ్యాంకు కోసం ఆసరా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేశారు. తర్వాత అధికారంలోకి కాంగ్రెస్ రావడంతో పాటుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు, విద్యా, వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో రఘునాథపాలెం మండలంలోకి ఏర్పాడ్డాయి. దీంతో బీఆర్ఎస్‌లోకి వెళ్లిన కాంగ్రెస్ క్యాడర్ తిరిగి సొంత గూటికి చేరుకొంది.

గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అధికార పక్షంలో ఉన్న కాంగ్రెస్ క్యాడర్‌ను మార్చేందుకు చూస్తున్నారు. ఈ క్రమంలోనే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు సంక్షేమ పథకాలపై ఫిర్యాదులను ప్రారంభించారు. గతంలో అర్హత లేకున్న ఆసరా ఇతర సంక్షేమ పథకాలను కల్పించిన వారే తిరిగి కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేశారు. అర్హత లేకున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నారంటూ ఫిర్యాదులు ప్రారంబించారు. దీంతో రఘునాథపాలెం మండలంలోని గ్రామాల్లో ఆసరా పింఛన్లు ఆలజడి నెలకొంది. అందరి పింఛన్లు, పథకాలు మరోసారి పరిశీలన చేస్తారనే ప్రచారం వారం రోజులుగా జోరందుకోంది. ఈ విషయంపై ఎంపీడీవో ఆశోక్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అర్హత లేని వారికి ఆసరా పింఛన్లు అందుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయని త్వరలో విచారణ చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు బుధవారం రాత్రి కేసునమోదైంది. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి చెందిన కాతం గోపిరెడ్డి(31) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. మూడు రోజుల క్రితం అతడు హైదరాబాద్‌లో గడ్డి మందు తాగటంతో అక్కడ ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం ఖమ్మం తీసుకొచ్చి ఇక్కడ ఓ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఖానాపురంహవేలి పోలీసులు తెలిపారు.

కోర్టు వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని వినతి



న్యాయాధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కోర్టు ఎదుట ప్రధాన రహదారిపై ప్రతీ రోజు వాహనరద్దీ అధికంగా ఉంటుందని, వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్‌చౌదరి, సింగం జనార్ధన్‌లు కోరారు. బుధవారం న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖరరావుకు వినతిపత్రం సమర్పించి న్యాయ సేవాధికారిసంస్థ ద్వారా పోలీస్ కమిషనర్‌కు సిఫారసు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం వలన న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, సాధారణ ప్రజలు రహదారి దాటేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మహిళలు, వృద్ధులు, వికలాంగులు వంటివారు ప్రత్యేకించి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నేలకొన్నదని, కోర్టు సందర్శకుల భద్రత, పరిరక్షణ దృష్ట్యా, ఖమ్మం జిల్లా కోర్టు ఎదుట అత్యవసరంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రవాణా చేస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంధసిరి, పెద్దమండవ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్నారన్న స మాచారం మేరకు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కొత్త లైన్లతో కరెంట్ సరఫరాలో అంతరాయం

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల నిర్మాణం, మరమ్మతుల కారణంగానే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ పి.సుందర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్త లైన్ల నిర్మాణం, వాటిని మార్చటం, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెలలో అప్పుడప్పుడు 10నుంచి 30నిమిషాలు కరెంట్ సరఫరా నిల్చిపోతుందని పేర్కొన్నారు. ఒకవేళ 30నిమిషాలకుపైగా కరెంట్ సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అందువలన విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

20న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే మునిసిపల్ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం వైరా మునిసిపల్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20వతేదీన ఖమ్మంలోని గొరిల్లా పార్కు పక్కనున్న అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాసభల్లో మునిసిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఖమ్మం నగర కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, నాయకులు గార పాటి అశోక్, ఎస్.కృష్ణ, ఉపేందర్, రాయపూడి శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడేపల్లి పంచాయతీ కార్యదర్శిపై బదిలీ వేటు

ముదిగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మేడేపల్లి పంచాయతీ కార్యదర్శిపై బదిలీ వేటు పడింది. గ్రామంలో పారిశుధ్య పనులు జరగడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయంలో చెత్త వేసి నిరసన తెలిపిన విషయం విదితమే. పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించినందుకుగానూ పంచాయతీ కార్యదర్శి రమ్యను ముదిగొండ మండలం మల్లారంకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మల్లారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కోటేశ్వరరావును మేడేపల్లికి బదిలీ చేస్తూ అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుధ్య పనుల నిర్వహణలో విఫలమైనందుకు మేడేపల్లి ప్రత్యేక అధికారి అయిన ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి అదనపు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు

జర్నలిస్టు మోహన్ బాబుకు పలువురి నివాళి



మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్టు వేము మోహన్‌బాబు సంతాప సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు, పలువురు అధికారులు, అభిమానులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. దశదిన కార్యక్రమానికి విచ్చేసిన బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీలు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, దేవరపల్లి భాస్కరరావు, పెద్ద బోయిన మల్లేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, దేవరపల్లి వేంకటేశ్వరావు, సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు జి.క్లైమెంట్, వేము రాంబాబు, దామాల దయాకర్, డిప్యూటి తహసిల్దార్ బాబ్జీప్రసాద్‌తోపాటుగా పలువురు అధికారులు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ



గ్రేట్ విజన్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ అందజేస్తున్న దృశ్యం

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్‌విజన్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థిని తంగిళ్ల రాధికకు సైకిల్‌ను కాపా మురళీకృష్ణ అందజేశారు. ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మదన్‌మోహన్ సహకారంతో రాధికకు సైకిల్‌ను సమకూర్చారు. ఆ దంపతుల వివాహ వార్షికోత్సవ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆ క్లబ్‌ల నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్‌రావు, జాలా పుల్లారావు, చింతోజు నాగేశ్వరరావు, తోట కూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, మహాలక్ష్మీ, గోపి, రామకృష్ణ పాల్గొన్నారు.

నాటి ఉద్యమానికి స్ఫూర్తిగా..చాకలి ఐలమ్మ

సత్తుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలిదశ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్మరించుకుంటూ ముందుకు సాగాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని దోబీఘాట్ వద్ద ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, కమిషనర్ కె.నరసింహాతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

మధిర: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం మధిరలోని నందిగామ బైపాస్ రోడ్డులో ఉన్న ఐలమ్మ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి ఆమె సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సీపీఐ డివిజన్ నాయకులు బెజవాడ రవి, రజక సంఘం నాయకులు బుజ్జి, కొత్తపల్లి నరసింహరావు, వెంకటనర్సయ్య, తలుపుల వెంకటేశ్వర్లు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తల్లాడ: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని సందర్భంగా బుధవారం తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీవో కోటయ్య, మండల పరిషత్, ఈజీఎస్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైరా: వైరాలో బుధవారం తెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. రజకసంఘం, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఐలమ్మకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఎర్రుపాలెం: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీజిల్లా కమిటీసభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, సీపీఎంపార్టీనాయకులు గామసు జోగయ్య, షేక్ నాగుల్‌మీరా, నాగులవంచ వెంకటరామయ్య పాల్గొన్నారు.

పెనుబల్లి: వీరవనిత చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం వీఎంబంజర్‌లోని ఆమె విగ్రహానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడువిఠల్‌రావు, రజకసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా కార్యదర్శి నాగమణి, మాదాసు నాగేశ్వరి పాల్గొన్నారు.

మధిరరూరల్: మధిరలో బుధవారం పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. విగ్రహానికి సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఐ నాయకులు కూడా నివాళులర్పించారు.



సత్తుపల్లిలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు



మధిరలో మాట్లాడుతున్న గోపాలరావు



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఉద్యోగులు



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



వైరాలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుబల్లి వీఎంబంజర్‌లో..

వైరా స్పెషలాఫీసర్‌గా పద్మావతి



వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరా మండల ప్రత్యేక అధికారిగా ఖమ్మం మెప్మా పీడీ జి.నళిని పద్మావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గడచిన కొన్నేళ్ల నుంచి మండల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పోయినెల చివర్లో ఉద్యోగ విరమణ చేశారు. దాంతో మండల ప్రత్యేక అధికారి పోస్టు ఖాళీ అయింది. ఆస్థానంలో నళిని పద్మావతిని నియమిస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలిచ్చారు. ఆమేరకు బాధ్యతలు చేపట్టారు.

ఏన్కూరు ఎస్ఐగా సంధ్య



ఏన్కూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు నూతన ఎస్ఐగా నారబోయిన సంధ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రఫి ఖమ్మంకు బదిలీ అయ్యారు. ఖమ్మం 2టౌన్ నుంచి ఎస్ఐ సంధ్య ఏన్కూరుకు బదిలీపై వచ్చారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతిగా సీపీ.రాధాకృష్ణన్ విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి వైరాలో బీజేపీ నాయకులు విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. బీజేపీ జెండాలతో నినాదాలు చేస్తూ బాణాసంచా కాలుస్తూ సంబురాలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, నాయకులు చింతనిప్పు రామారావు, పల్లపాటి వెంకటేష్, అనిల్, ఉదయ్‌చరణ్, గూడూరు శివారెడ్డి వెంకట్రావ్ పాల్గొన్నారు.

హరికిషోర్‌కు ప్రతిభా పురస్కారం

ఏన్కూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సాహిత్యం జ్యోతిష్యశాస్త్రం, హస్త సాముద్రికము రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు గాను డాక్టర్ హరికిషోర్‌గౌడ్‌కు కేంద్ర ప్రభుత్వం భారత ప్రతిభా పురస్కార్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈమేరకు బుధవారం ప్రధానమంత్రి కార్యాలయంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అనురాగ్‌ఠాకూర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఏన్కూరు గురుకుల విద్యాలయంలో కొన్నేళ్ల సంస్కృత ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఈసందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.



పెన్షనర్ల ప్రయోజనాల కోసం ఆందోళన తప్పదు



జగన్నాథం దంపతులను సన్మానిస్తున్న రెహ్మాన్

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగుల ప్రయోజనాల చెల్లింపుల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని, ఆ ప్రయోజనాల సాధన కోసం విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు హెచ్చరించారు. వైరాలోని దత్తసాయి కల్యాణ మండపంలో బుధవారం వైరా డివిజన్ పెన్షనర్ల సదస్సు డివిజన్ అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో శరత్‌బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పింఛన్ విధానాన్ని అమలుచేసేందుకు ఆరాటపడుతున్నాయని ఆరోపించారు. పెన్షనర్ల ప్రయోజనాలు ఒక్కొక్కటిగా అంతరించిపోతున్న సమయంలో పెన్షనర్లందరూ ఒకతాటిపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్యతతో గత ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేసినందున ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆదరించాలని అయినప్పటికీ ఈ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైరాలో పెన్షనర్ల భవనం ఆధునీకరణకు ఆర్థిక తోడ్పాటునందించిన పెన్షనర్లు పైడిపల్లి సత్యనారాయణ, కొల్లి దుర్గా, వీసీ.సత్యనారాయణ, కొత్తా జగన్నాథ రావు, ఎస్.యూస్ఫీ, అబ్బూరి రమణమ్మలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్ సన్మానించి అభినందించారు. ఈ సదస్సులో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, తాళ్లూరి వేణు, వైరా యూనియన్ బ్యాంకు మేనేజర్ కల్యాణ్‌రాజ్, రిటైర్డ్ సంఘం నాయకులు టీవీ.కృష్ణయ్యసూరి, మరికంటి వాసుదాసు, ఎన్.పెంటయ్య, షేక్.వలీజాన్, టి.సుబ్బయ్య, చల్లా కృష్ణారావు, సీహెచ్ఎస్‌వీ.ప్రసాద్, ఎం.జయశంకర్, సామినేని వెంకటేశ్వరరావు, అరుణ, శారదా, జీవీ.కృష్ణారావు, పి.నర్సింహారావు, వైరా ఏటీవో ఎల్లయ్య పాల్గొన్నారు.

వైరా.. బీఆర్ఎస్‌లో ఎవరి గోల వారిదే

» ఇన్‌చార్జ్ పోటీదారులుగా బానోత్ చంద్రావతి, బానోత్ మంజుల, లకావత్ గిరిబాబు







వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో ఎవరి గోల వారిదే అనే రీతిలో నాయకులు వ్యవహరిస్తుండడంతో కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారు. చివరికి రాష్ట్ర జిల్లా పార్టీ అనుమతి, ఆమోదం లేకుండానే ఏకంగా తమకు నచ్చిన వారితో పార్టీ మండల కమిటీలను ప్రకటించుకోవడం ద్వారా ఇక్కడ బీఆర్ఎస్‌లో ఏంజరుగుతుందో తెలియని అయోమయంలో పార్టీ నాయకత్వం ఉంది. గత కొన్నినెలల నుంచి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకపోవడంతో ఎవరికివారే అన్నీ తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ గత మే 27వతేదీన అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటి నుంచి ఇక్కడ బీఆర్ఎస్ నాయకత్వలేమితో కొట్టుమిట్టాడుతోంది. ఈ తరుణంలో వైరా నియోజకవర్గంలో తొలిగా ఎమ్మెల్యే అయిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోతు చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సతీమణి బాణోతు మంజుల భర్త వారసురాలిగా అలాగే జూలూరుపాడు మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు ఈ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తున్నారు. ఈ ముగ్గురు తమకు అనుకూలమైన కొన్ని మండలాల్లో మాత్రమే పర్యటనలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ఎక్కువగా కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో పర్యటిస్తున్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను, యూరియా కోసం రైతులు చేస్తున్న ఆందోళనల వద్దకు వెళ్లి వారికి మద్దతు తెలుపుతున్నారు. కొన్ని కుటుంబాలను పరామర్శిస్తున్నారు. అదేవిధంగా మదన్‌లాల్ సతీమణి మంజుల కారేపల్లి, వైరా, ఏన్కూరు, కొణిజర్ల మండలాల్లో కొంతమంది నాయకులతో కలిసి పర్యటించారు. పార్టీకి చెందిన పలు బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్నారు. జూలూరుపాడు మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లోనే పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇదే సందర్భంలో ఇటీవల జూలూరుపాడు, ఏన్కూరు, కొణిజర్ల మండలాల్లో అక్కడ మదన్‌లాల్ వర్గానికి చెందిన వారు మండల కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రసార మాధ్యమాల్లో ప్రకటించుకున్నారు. ఇది తెలిసిన వెంటనే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర, జిల్లా పార్టీల అనుమతి లేకుండా ఏ కమిటీ జరగదని స్పష్టం చేశారు. పార్టీ అనుమతి లేకుండా పైన పేర్కొన్న మూడు మండల కమిటీలు చెల్లవని స్పష్టం చేశారు. పార్టీ అనుమతితోనే మండల కమిటీ ఎన్నికలు జరుగుతాయని, ఎవరికివారు ఇష్టానుసారం కమిటీలను ఎన్నుకుంటే సహించబోమని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఘాటుగా హెచ్చరించారు. దాంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని తేటతెల్లమవుతుంది. 2009లో వైరా నియోజకవర్గం ఏర్పడింది. 2009లో కూటమికి చెందిన సీపీఐ అభ్యర్థి చంద్రావతి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆమె తన పదవీకాలం చివర్లో సీపీఐతో విభేదించి బీఆర్ఎస్‌లో చేరి 2014 ఎన్నికల్లో ఆపార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. ఆ ఎన్నికల్లో సీపీఎం మద్దతుతో వైసీపీ నుంచి పోటీచేసిన బాణోతు మదన్‌లాల్ విజయం సాధించి ఆ వెంటనే బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసిన మదన్‌లాల్ స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ చేతిలో ఓడిపోయారు. ఎమ్మెల్యేగా గెలిచిన రాములునాయక్ ఆవెంటనే బీఆర్ఎస్‌లో చేరారు. అయినప్పటికీ 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న రాములునాయక్‌ను పక్కనపెట్టి ఆయనపై ఓడిపోయిన మదన్‌లాల్‌కే బీఆర్ఎస్ టిక్కెట్‌ను కేటాయించారు. అయినప్పటికీ ఆఎన్నికల్లో మదన్‌లాల్‌ను విజయం వరించలేదు. కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్ విజయం సాధించారు. బీఆర్ఎస్ టిక్కెట్‌పై గెలవనప్పటికీ ముగ్గురు ఎమ్మెల్యేలు ఆపార్టీకి ప్రాతినిథ్యం వహించారు. అయినప్పటికీ ఇప్పుడు వైరాలో బీఆర్ఎస్ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నుంచి అనేకమంది కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకత్వలేమితో కొట్టుమిట్టాడుతుంది. చంద్రావతి, మంజుల, గిరిబాబు ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తున్నారు. ఎవరికివారే మండల కమిటీలను ఎన్నుకుంటున్నారు. ఇప్పుడున్న నేతల్లో ఏఒక్కరు కూడా నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో పార్టీ శ్రేణులను ప్రభావితం చేసే స్థితిలో లేరనే చర్చ నడుస్తోంది. అయినప్పటికీ ఎవరి గోల వారిదనే రీతిలో వారు వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితులను నాయకత్వం ఏమేరకు చక్కదిద్దగలదోనని ఆపార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నారు.

వీఎంబంజర్ హెచ్ఎంకు అభినందన




పెనుబల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా బహుమతి అందుకున్న వీఎం బంజర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఇలాంటి బహుమతులు పాఠశాల చరిత్రలో చాలా అరుదుగా వస్తాయని, ఆయన పట్టుదల ప్రణాళికాబద్ధమైన నిర్వహణ, విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల ఐక్యతతోనే ఈ విజయాన్ని సాధించడం జరిగిందన్నారు. ఆయన నాయకత్వం పాఠశాల అభివృద్ధికి ప్రేరణ అని, పాఠశాలకు ఈ బహుమతి రావడం అందరికి గర్వకారణమని పేర్కొన్నారు. వైజ్ఞానిక ప్రగతి, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాలు అన్నీ ప్రధానోపాధ్యాయుడి కృషి ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ బహుమతి తన వ్యక్తిగత విజయం కాదని, ఉపాధ్యాయులు, సిబ్బంది అంకితభావం, విద్యార్థుల కృషి, గ్రామస్థుల సహకారంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీవీ.రామారావు, వంగా రామారావు, రాజు, జాన్‌బీ, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నీరు తూములకు ఎక్కడంలేదని ఎస్ఈకి వినతి

కొణిజర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోనకల్ బ్రాంచ్‌కెనాల్ కాల్వ నీరు కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామ రైతులకు అందడంలేదని సాగర్ నీరు తూములకు ఎక్కే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు నీటిపారుదలశాఖ ఎస్ఈని కలిసి వినతిపత్రం అందించారు. కాల్వలో నీరు చివరకు వెళుతున్నాగాని ఆదిలో ఉన్న తనికెళ్ల గ్రామ రైతుల భూములకు అందడంలేదని తెలిపారు. దీంతో వరిపొలాలు ఎండిపోతునాన్యని వివరించారు. భారతీయకిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలకు ఫ్రిజ్ వితరణ

వైరా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ విద్యాసంస్థల్లో ఉన్న మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలకు స్థానిక లయన్స్‌క్లబ్ ఒక ఫ్రిజ్‌ను వితరణగా అందజేసింది. బుధవారం ఈ ఫ్రిజ్‌ను తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ప్రిన్సిపల్ పాసంగులపాటి రాధికకు అందజేశారు. ఉంద్రు .అజయ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 194లీటర్ల సామర్థ్యం కలిగిన ఫ్రిజ్‌ను ఈ గురుకులానికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, .బుచ్చిరామారావు, చింతోజు నాగేశ్వరరావు, పి.ఉపేంద్రరావు, ఉంద్రు శ్యాంబాబు, చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గురుకులానికి ఫ్రిజ్ వితరణ చేస్తున్న దృశ్యం

మహిళ మృతి ఘటనలో ఒకరిపై కేసు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి వేధింపులకు పాల్పడి బాధితురాలు ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తిపై బుధవారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కప్పలబంధం గ్రామానికి చెందిన ఎం.సరోజనితో అదే గ్రామానికి చెందిన కంటిపూడి యోహాన్ నాలుగు సంవత్సరాలు సహజీవనం చేశాడు. బాధితురాలని శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడు. దీంతో ఇటీవల సరోజని పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెవెళ్లగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలి తమ్ముడు గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడైన యోహాన్‌పై స్థానిక ఎస్ఐ డి.హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి



రాధాకృష్ణ(ఫైల్)

చింతకాని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన శీలం రాధాకృష్ణ (39) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు ఖమ్మంలోని ఓ ప్రైవేటు మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చిన రాధాకృష్ణకు అకస్మాతుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జమ్ముల జితెందర్‌రెడ్డి, కూచిపూడి రవి, దూసరి గోపాలరావు, నకనబోయిన కృష్ణ పాల్గొన్నారు.

రామకృష్ణపురంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా

చింతకాని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలో బోనకల్- ఖమ్మం రోడ్డుపై బుధవారం రాత్రి బోల్తా కొట్టింది. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కుకు ఉన్న టైరు ఒక్కసారిగా ఊడి పోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ట్రాక్టర్ బోల్తా పడటంతో ఖమ్మం- బోనకల్ రోడ్డుపై గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మిక సంక్షేమానికే వినియోగించాలి

ముదిగొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ బోర్డు నిదులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ఆరో మహాసభ నారోజు ఈశ్వరాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి వారి స్థితిగతులను రోజురోజుకు దిగజార్చుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ద్వారా లేబర్ కోడ్ చట్టాన్ని అనుసరించి కార్మికుల సంక్షేమ బోర్డులో జమచేసుకున్న రూ.1005కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా చెరుకుపల్లి వీరబాబు, నారోజు బ్రహ్మాచారిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దోనోజు లక్ష్మణాచారి, సీఐటీయూ మండల కన్వీనర్ టీఎస్.కల్యాణ్, శెట్టిబోయిన వెంకటేశ్వర్లు, ఇరుకు నాగేశ్వరరావు, పుల్లయ్య, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

సత్తుపల్లిని సుందరంగా ఉంచే బాధ్యత మీదే

» 100రోజుల కార్యాచరణ ప్రణాళిక ముంగిపులో ఎమ్మెల్యే రాగమయి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సత్తుపల్లి మునిసిపాలిటీని సుందరంగా ఉంచే బాధ్యత పారిశుధ్య కార్మికులదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. మునిసిపాలిటీలో 100రోజుల కార్యాచరణ ప్రణాళిక ముంగిపు సందర్భంగా ప్రతిభ చూపిన కార్మికులను శాలువాతో సన్మానించి బహుమతులను అందజేశారు. సహనం, ఓపికలతో పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టిసారించడంతోనే పట్టణం సుందరంగా మారిందని, కొన్నిచోట్లా లోటుపాట్లను సరిచేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సెంటర్ డివైడర్‌పై మొక్కలను కట్‌చేసి అక్కడే పడవేసి ఎండిపోతున్నా మూడురోజులైనా తీయడం లేదని, వైరింగ్ కోసం తవ్విన గుంతలను త్వరితగతిన పూడ్చడంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను త్వరగా ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఇంటిని చూసి ఇల్లాలి ఎలాంటిదో చెప్పవచ్చని, పట్టణంలోని శుభ్రంగా ఉండే డివైడర్లను చూసి మునిసిపాలిటీ ఎలాంటిదో అర్థమవుతుందని, ఆ దిశగా పనిచేయాలని కోరారు. అదనపు సిబ్బంది, కార్మికుల జీతాల పెంపుదల, ఇళ్లు, ఇళ్లస్థలాల విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, గాదె చెన్నారావు, ఎండీ.కమల్ పాషా, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.